# Andhra Jyothi

## 6 వేల కొలువులు

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగమేళా

వారంలో గురుకుల టీచర్ల పోస్టులకు ప్రకటన

## అతిత్వరలో గ్రూప్-2 నోటిఫికేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఎంతోకాలంగా విద్యార్థులు, యువత ఎదురుచూస్తున్న గ్రూప్-2 పోస్టుల భర్తీకి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 1,036 ఉద్యోగాల భర్తీకి ఉద్దేశించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను అతి త్వరలో విడుదల చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సిద్ధమవుతున్నది. మరోవైపు గురుకులాల్లో 2,444 టీచర్ పోస్టుల భర్తీకి వారంలో నోటిఫికేషన్ వెలువడనున్నది. దీనితోపాటే గురుకులాల్లోని సుమారు 2,500 ఇతర పోస్టుల భర్తీకి అనుబంధ నోటిఫికేషన్ విడుదల కానుంది. మంగళవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అధ్యక్షతన రెండుగంటలపాటు కొనసాగిన కమిషన్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కొత్త పోస్టులు జమ అవుతున్నందున గ్రూపు-2ను అనుబంధ నోటిఫికేషన్‌గా విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ రెండు నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ చివరివరకు గడువు ఇస్తారని తెలుస్తున్నది. ఈ ఉద్యోగాల భర్తీకి పరీక్షలను అక్టోబర్ చివరివారంలో లేదా నవంబర్ మొదటివారంలో నిర్వహించే అవకాశం ఉందని చెప్తున్నారు. పాత జోన్ల విధానంతోనే ఉద్యోగాల భర్తీ ఉంటుంది. ఆయా విభాగాల

### టీఎస్‌పీఎస్సీ ముమ్మర ఏర్పాట్లు

(మిగతా 11వ పేజీలో)

## అతిత్వరలో గ్రూప్-2 నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి) నుంచి ఇండెంట్ వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. మరోవైపు 2011 గ్రూపు-1 మెయిన్ పరీక్షలకు టీఎస్‌పీఎస్సీ సర్వం సిద్ధం చేసింది. సెప్టెంబర్ 13 నుంచి 23 వరకు జరుగనున్న ఈ పరీక్షకు 25 వేలమంది హాజరుకానున్నట్లు సమాచారం.

**భూగర్భజలశాఖలో 40 ఉద్యోగాల భర్తీకి 79 మంది ఎంపిక:** భూగర్భ జల శాఖలోని 40 పోస్టుల భర్తీకి నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో భాగంగా 79మంది అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో టీఎస్‌పీఎస్సీ ఎంపిక చేసింది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన పరీక్షలకు 3,827 మంది హాజరయ్యారు. ఇందులో నుంచి 79 మందిని సర్టిఫికెట్ల పరిశీలనకు రావాల్సిందిగా టీఎస్‌పీఎస్సీ సూచించింది. ఈ అభ్యర్థుల వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

**పోస్టుల వివరాలు ఇవీ:** అసిస్టెంట్ కెమిస్టు పోస్టు 1, అసిస్టెంట్ జియోఫిజిస్ట్ పోస్టులు 2, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ పోస్టులు 28, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ పోస్టులు 9.